24399

# నిజం

"సావిత్రీ! నువ్వూ, పిల్లలూ రిక్షామీద ఇంటికి వెళ్లిపోండి. నేను వెనకాలే వస్తాను" అంటూన్న భర్తని విస్తుబోయి చూసింది సావిత్రి.

చీకటిపడిందంటే చాలు- ఇది ఎంత నగరమైనా, ఆడదాని మాన ప్రాణాలకు రక్షణలేదే. వెంటమగవాళ్లున్నా లక్ష్యపెట్టక, ఆడవాళ్లను ఈలవేసి, గోలచేసే ప్రబుద్ధులుంటారు. స్వంతభార్యతో సినిమా చూసి, రాత్రియింటికి వెళ్తూన్న భర్తని 'ఎవర్తెని లేపుకు పోతున్నావు. నడు స్టేషన్‌కి' అంటూ నిలదీసి, ఆడమనిషివైపు లొట్టలేసిచూస్తూ రభసచేసే 'రక్షకభటు'లుంటారు.... ఇటువంటి నగరంలో.... రాత్రివేళ.... చిన్న పిల్లలతో....

"మళ్లీ మీరుఆగిపోవడం దేనికండీ? కలిసేపోదాం. పదవుతోంది కదా- ఇంకా ఏం తిరుగుతారు?" ఈరోజు భర్త చూపించిన ప్రేమకి భార్యగా స్వతంత్రం తీసుకుని అంది సావిత్రి.

"షోర్యుప్- చనువిస్తే చంకఎక్కేస్తావు ఇడియట్. మారుమాట లేకుండా పిల్లల్తో కొంపకు తగలడు త్వరగా. దేభ్యంమొహం నువ్వూ.

అటుఇటు పిచ్చిపిచ్చి తిరుగుళ్లు తిరిగినట్లు తెలిస్తే నరికిపోగులెడతాను"- నడిరోడ్డు, నలుగురూ వింటారనే యింగితంకూడా మరచిపోయి కంయ్ మన్నాడు విశ్వం.

విస్తుపోయింది సావిత్రి భర్తపరివర్తనకి. సిగ్గుతో, ఎర్రబడ్డ ముఖంతో కుంచించుకుపోయింది. తన్నుకొస్తూన్న దుఃఖాన్ని పళ్లవెనక బిగపట్టింది. భర్తఆజ్ఞ శిరసావహించి, రిక్షాలోకూలబడి, యింటికిప్రయాణమయింది యిద్దరుపిల్లలతో.

కిళ్లీషాపులదగ్గర్నుంచి కూతలు, రిక్షాపక్కగా మనిషికి రాసుకుపోతూ ఈలలూ, పిచ్చిపిచ్చినవ్వులూ, వెర్రిమొర్రిచూపులూ......... ఊహించినవే కావడంతో అనుభవించడం మరీ కష్టసాధ్యం కావడంలేదు. దారిపక్క ఊరకుక్క సైతం తనవైపుచూస్తూ వింతగామొరుగుతోంది. రిక్షా నిర్లక్ష్యంగా నడుస్తోంది. ఒళ్లోబాబుని, పక్కనపాపనీ కూర్చోబెట్టుకొని, శూన్యంలోకి నిర్లిప్తంగాచూస్తూ ప్రయాణిస్తోంది సావిత్రి—

సాయంత్రం అయిదుగంటలకి ఎన్నడూలేని హుషారుతో ఇంటికి వస్తూనే. "సావిత్రీ- నువ్వూపిల్లలూ చక్కగా తయారవ్వండి. మనం సినిమాకెళ్తున్నాం" అన్న భర్తమాటలు కోటివీణానాదాలై ఆమె గుండెల్లో మోగాయి. ఆనందాశ్చర్యాలనుంచి తేరు కోవడానికి చాలాసేపేపట్టింది.

తను మరిచేపోయింది- ఈరోజు తమపెళ్లిరోజుట.

భర్తకుగుర్తుండి, తమనిసినిమాకి తీసుకువెళ్లడానికి అయిదింటికే యింటికిరావడం మరో ప్రపంచ వింత.

క్షణం వృథా చెయ్యకుండా చకచకాపిల్లల్ని ముత్యాల్లాతయారు చేసి, తనూ ముస్తాబయ్యింది. బాబునిఎత్తుకుని, "బయల్దేరండ"ంటూ హుందాగా, అందంగా ఆజ్ఞాపించాడు విశ్వం.

"ఏమండీ, ఓ అరగంట టైముంటే అన్నంపడేసి, వేపుడు ముక్కలువేయించి వచ్చేస్తానండి. ఏంలేదు- రాత్రిమనంవచ్చాక పిల్లలూ

మనంకూడా మాంఛి ఆకలిమీదుంటాం. అప్పుడు వంట మొదలు పెట్టాలంటే కష్టమవుతుంది.

"ఓసిపిచ్చిమొహవా! 'పండగ పూటాపాతమొగుడేనా' అని, ఈరోజూ యింట్లో భోజనమే? సినిమాఅవ్వగానే, మీకు సిద్దార్ధలో నార్త్ ఇండియన్‌ఫుడ్ పెట్టిస్తానివాళ. ఫ్రైడ్‌రైస్, పాలక్‌పనీర్, క్రీస్పీరోల్స్, మిక్స్‌డ్ వెజిటబుల్స్....ఒకటేమిటి, మీరు తినగలిగినన్ని తిందురుగాని. కమాన్. హరీఅప్...."

—వెర్రిఆనందం పులకలేసింది సావిత్రిలో. ఆ ఆనందంలో కళ్లమూస్తే జన్మధన్యమన్నంత ఆనందం.

ఇంటికి తాళంవేసి, గేటుదాటిబయటకు వచ్చేసరికి, ఆటోనిపిలిచి, భార్యాపిల్లల్ని ఎక్కమన్నాడు విశ్వం. బాబుపుట్టాక ఎక్కుతూన్న మొట్టమొదటి ఆటో. దార్లో పూలదుకాణందగ్గర ఆపి, నాలుగుమూర్ల మల్లెల దండకొన్నాడు భార్యకి, పాపకి. హాలుముందాగింది ఆటో. హాలుముందున్న సినిమా పోస్టర్లుచూసి, నిరుత్సాహం ప్రకటించింది సావిత్రి "ఏమండీ- వేరేసినిమాకి వెళ్దాం. ఇందతబాగుండదేమో" అంటూ, ఎందుకో ఆమెకు ఆసినిమా చూడటంసుతరామూ యిష్టమున్నట్లుగా లేదు.

"వేరేవి అస్సలు బాగులేవుట. అయినా బావుంటుందనా సినిమాకి వెళ్లడం- ఏదోకాలక్షేపానికిగానీ," అంటూ బుకింగువైపునడిచి, బాల్కనీకి టిక్కెట్లు తీసుకున్నాడు. హాల్లోతినడానికి రెండు చిప్స్‌ప్యాకెట్లూ, రెండు బిస్కట్‌ప్యాకెట్లూ కొన్నాడు.

ఎన్నడూ ఎరగని మెత్తటిసీటుమీద జార్లపడి కూర్చుని, సంతోషంగా ఎగురుతోందిపాప. భార్యభుజంమీదుగా చెయ్యివేసి కూర్చుని, మధ్యమధ్యలో జోక్స్ విసురుతూ, సినిమాచూస్తున్నాడు విశ్వం. ఇంటర్వెల్‌వరకూ అలాగే ఆనందంగా గడిచిపోయింది. ఇంటర్వెల్‌లో భార్యాపిల్లలకి కూల్‌డ్రింక్స్ ఇప్పించాడు కూడా. అదేసంతోషంలో ఆరోజు

పూర్తిగా గడిచిపోతే, సావిత్రి జన్మధన్యమయినట్లే, కాని ఆరాత ఆమె ముఖాన్నలేదు-

తెలుగు సినిమాలకి మాంచి కమ్మర్షియల్ పాయింట్ 'హీరోయిన్ స్నానఘట్టం' మొదలయ్యింది. చటుక్కున కళ్లుదించుకుంది సావిత్రి, హీరోయిన్ కూనిరాగం తీస్తూ బట్టలొక్కటొక్కటి విప్పపడేస్తోంది.

అప్రియత్నంగానే పయిట భుజంమీదుగా లాక్కుంది సావిత్రి. ఆమె గుండెచప్పుడు చెవుల్లోప్రతిధ్వనిస్తోంది.

సీట్లోసర్దుకుని కూర్చుని, గుడ్లప్పగించి, ఊపిరి బిగపట్టి చూస్తు న్నాడు విశ్వం. పిల్లలదృష్టిని తెరమీదనుంచి తనవైపుతిప్పుకోవడానికి బిస్కట్‌ప్యాకెట్ విప్పిందిసావిత్రి.

అయిదునిముషాలపాటు సాగింది హీరోయిన్ తొంభయిశాతం శరీరం నగ్నంగా జరిపిన జలక్రీడల ఘట్టం. చాలామంది 'ఈఒక్క సీనూచాలుగురూ—డబ్బులు గిట్టుబాటయిపోతాయి' అనుకునే సీను.

అప్పట్నుంచీ ఒక్కమాటకూడా మాట్లాడలేదు విశ్వం, పలక రించినాపలకలేదు. అన్యమనస్కంగా కూర్చుండిపోయాడు. సినిమా అయ్యాక తనవొక్కర్తెనీపిల్లలతో యింటికి పొమ్మన్నాడు. కొత్త భయం అంకురించింది సావిత్రి మనుస్సులో—నిజం కనిపెట్టేసాడా అనేభయం—

.... .... .... .... ....

పిల్లలకోసమేనా తప్పదుకాబట్టి, అన్నంవండి, వాళ్లకుపెట్టి నిద్ర పుచ్చింది. లైటుఆర్పేసి, గుమ్మందగ్గర చతికిలబడి, తలుపుకిఆనుకుని మోకాళ్లమీద గడ్డం ఆన్చుకుని, గేటువైపుచూస్తూకూర్చుంది సావిత్రి, ప్రక్కింటివాళ్లుకూడా వూళ్లోలేరు.

రోజూ అలవాటయినదే అయినా, ఈ రోజుకలిగిన వూహించని సంతోషం కారణంగా, ఒంటరితనం భయంకరంగావుంది. కొంప

తీసి నిజం గ్రహించడమే జరిగితే తనఅంతుచూస్తాడు.........మరి పిల్లలగతి?!

గడచిన గంట సమయం ఓ యుగంలావుంది. చీమ చిటుక్కు మన్నా భయంగా వుంది. ఇంతలో వూహించని పరిణామం—

చల్లనిగాలి, ఆపైనటపటపమంటూ చినుకులు. కొద్దినిముషాల్లోనే ఉరుములు, మెరుపులతో హోరున వర్షం, చుట్టుపక్కల వెలుగుతూన్న దీపాలు టక్కున కళ్లుమూసుకున్నాయి--కరెంటు పోయింది. చీకటి గాఢాంధకారం. హోరున కురుస్తూన్న వర్షంధ్వని తప్ప-కళ్లకు ఏమీ కనిపించడంలేదు. తనకేదోఘోర అన్యాయం జరిగి పోతున్నట్లు గేటు అవతల ఊరకుక్కొకటి గొంతెత్తి హృదయవిదారకంగా ఏడుస్తోంది. యముడు జారవిడిచిన పాశం లా వుంది తెగి వేళ్లాడుతూన్న కరెంటు తీగ—

తడుముకుంటూ లోపలకువెళ్లి, హరికేన్‌లాంతర్ వెలిగించి, బల్లకిరింద పెట్టివచ్చి, చేతులు కట్టుకుని నుంచుని, భర్తగురించి ఆలో ఆలోచనలో పడింది మళ్లీ—

తను పియుసి చదువుతూన్న రోజులవి.

యవ్వనంలోకి అడుగుపెట్టిన తొలిరోజులు, మగవాసన అంటేనే గమ్మత్తనిపించే రోజులు. అమ్మానాన్నలకు తెలియకుండా అబ్బాయిలతో కబుర్లుచెప్పడం, లవ్‌లెటర్స్ రాసుకోవడం గొప్పతనం అనుకునేరోజులు ఆరోజుల్లో ఎదురింటి మేడమీదగదిలో అద్దెకు వుండేవాడు విశ్వం.

పెద్ద అందం కాకపోయినా మంచి ఆకర్షణవుండేది విశ్వంలో. ముఖ్యంగా తల్లి శాపనార్థాలవేడిని అతగాడి చల్లనిమాటలే చల్లార్చేవి. దాంతో అతనివైపు తనకుతెలియకుండానే ఆకర్షితమయిపోయింది తను. తన అంగాంగాన్నీ వర్ణిస్తూ కవిత్వాలు వ్రాసాడతను. ఆకవిత్వాలు కేవలం కల్పనలు కావనీ, నిజమనీ నిరూపిస్తానని తనని ముగ్గుమ్మాటపెట్టి,

మాటలగారడీతో బంధించి, మూగదానిని, అశక్తురాలిని చేసి, ఒక్కొక్క ఆచ్ఛాదనా తొలగిస్తూ, అంగానికో పద్యం చొప్పునచెప్పి, తనని తన్మయురాలిని చేస్తూ, పూర్తిగా లోబరుచుకున్నాడు. ఆపైన తనని తీసుకుని ఆవూరు నుంచి 'లేచిపోయాడు.' గుళ్లో పెళ్లి చేసుకున్నాడు.

ఆ తర్వాత ఒక సంవత్సరం వరకు పువ్వుల్లోపెట్టి పూజించాడు. అంజతా శిల్పాలతోటీ, రవివర్మ అపూర్వ సృష్టులతోటీ తనని పోటీకి నిలబెట్టాడు. సంవత్సరం తిరిగాక. పాపపుట్టినప్పట్నుంచీ తనమీద కొద్దిగామోజు తగ్గింది అతనికి. రెండుసంవత్సరాలు గడిచేసరికి తిట్టడం ప్రారంభించాడు. మరోసంవత్సరానికి తాగుడు అలవాటయ్యింది ఇతర తిరుగుళ్లూ ప్రారంభమయ్యాయి. ఆ ఏడే బాబుపుట్టాడు. గత ఏడాదిగా తనంటేనే అసహ్యించుకుంటున్నాడు. ఇరవైఏళ్లన్నానిండని తననిపిల్లల్ని పెంచే ఆడమనిషిగా మాత్రం చూస్తాడు. వీలయినంత చులకనచేస్తాడు. హేళనచేస్తాడు. తిండిదండగంటాడు. తిడ్తాడు. మైకంలో వున్నప్పుడు కొడ్తాడు. జీతం తనచేతికి పైసాయివ్వడు. తన ఒంటిమీద నగలన్నీ దోచుకున్నాడు. ఇంట్లో సామానొక్కొక్కటీ తెగనమ్మాడు. తనంటే అస్సలు మోజులేదిప్పుడు.... మరలాంటివాడు ఈరోజు ఎందుకంత వింత ఆనందంగా కనిపించాడు?!.... అంతలోనే మళ్లీ ఎందుకు తనపద్ధతిలోకి మారిపోయాడు?!.... నిజంగానే.... నిజం గ్రహించేసాడా?!!....

"ఏ మొగుడికోసం ఎదురు చూస్తున్నావే గుమ్మంలో?"

—ఉలిక్కిపడి, వర్తమానంలోకి పూర్తిగా వస్తూ, తూలింది సావిత్రి.

"ఊఁ....ఎమిటలాతూల్తున్నావు?-;ఊ....? తాగావా?" చిత్తుగా తాగిన విశ్వం, ద్వార బంధాల్ని రెండు చేతుల్తోను ఊతకోసం పట్టుకుని, ముందుకువంగి, వంకరనోటితో అడుగుతున్నాడు. వానలోతడిసి ముద్దయి వున్నాడు.

పుట్టెడుదుఃఖంవచ్చింది సావిత్రికి. ఈః రోజుకూడాతాగాలా? తాగిన భర్తని చూడటం తనకేం కొత్తకాదు. కాని, ఈరోజు సాయంత్రంలాగ అతగాడు ప్రవర్తించడం చాలాకొత్తగా అనిపించింది. పెళ్లయిన కొత్తరోజులు గుర్తుకొచ్చాయి. మనసు పురివిప్పినాట్యం చేసింది. తనంటే యిష్టంలేనప్పుడు, తాగుడువి ఒక్క రోజన్నా విడవలేనప్పుడు అంతటిఆనందం తనకు ఎందుకు కలిగించినట్లు-తన హృదయాన్ని గానుగలో పెట్టి పిండిచెయ్యాలనే తలంపు కాకపోతే—

"అఃగాదేఖ్యం మొహంతో చూస్తావేమే ముండా-స్విచ్చివెయ్యి. చీకటిగా లేదూ?" అంతకు మించి అరవలేనంతగా కేకపెట్టాడు, పడకుండా నిలదొక్కుకుంటూ.

"కరెంటు పోయిందండీ" నూతిలోంచి వచ్చింది జవాబు.

వికటంగా నవ్వాడు విశ్వం.

"పోయిందా?....లేచిపోయిందా?....నువ్వులేచిపోకపోయావా?"

"రండి లోపలకి"

జబ్బ పట్టుకుని నడిపించుకువెళ్లి, మంచంమీద కూర్చోపెట్టి, పయిట చెరగుతో తలతుడవ సాగింది. ఆమెని ఒక్కతోపుతోసి మంచం మీద వెల్లకిలాపడ్డాడు.

"కొంచెం మజ్జిగఅన్నం తిందురుగాని, అప్పుడే నిద్రపోకండి" అంటూవంటింటి లోకి పరిగెత్తింది.

"మజ్జిగఅన్నం వద్దే చవటపీనుగా-మత్తుకాస్తా దిగిపోతుంది" కేకపెట్టాడు తల అడ్డంగా తిప్పుతూ. ఆటూఇటూ దొర్లుతూ, పిచ్చిపిచ్చి కూతలు కూస్తున్నాడు.

"లేవండి-కొంచెం ఎంగిలిపడండి" అంటూ ఒకచేత్తోకంచం పట్టుకొని, మరోచేతిని ఆసరాయిచ్చి, భర్తనిపైకిలేపి, కూర్చోబెట్టింది.

లేచినట్టే లేచి, ఒక్కదెబ్బకొట్టాడు కంచాన్ని. అది రివ్వునవెళ్లి యింటికప్పుకితగిలి, పెద్దశబ్దంచేస్తూ నేలతాకింది. అన్నం సావిత్రి మొహంమీద, గదంతా చిమ్మింది. కంచంపడ్డ ధ్వనికి పిల్లలిద్దరూ మేల్కొని, గట్టిగా ఏడుపు లంకించుకున్నారు.

"నోర్ముయ్యమను ఆపీనుగల్ని. లేకపోతే నిన్నూ, వాళ్లనీకూడా నరికి పోగులెడ్తాను"—పేట్రేగిన విచ్చలవిడితనం.

కొంగుతో మొహంతడుచుకుని, పిల్లల్ని బుజ్జగించి, నిద్రపుచ్చి నెమ్మదిగా భర్త ప్రక్కనేకూర్చుని, "ఏమండీ—మీరసలు ఎందుకంత ఆనందంగా మమ్మల్ని సినిమాకి తీసుకెళ్లారు? మధ్యలో మీ అంతటమీరే ఎందుకంత కోపంగా మారిపోయారు? చెప్పండి....నేనేమన్నా తప్పుగా ప్రవర్తించానా?........" దుఃఖాన్ని ఆపుకోవడానికి ఆమెచేసిన ప్రయత్నం విఫలమయ్యింది. జవాబుని ఆశించే ప్రశ్నించినా, అతను నిజాన్ని గహించియిచ్చిన జవాబయితే అదితనని నిలువునా చీల్చేస్తుం దనే భయమూవుంది.

తీసిపారేస్తూ, తేలిగ్గా నవ్వాడు విశ్వం—

"పిచ్చిముండా.... నేను.... నీకు .... నా మూడ్స్ ఎప్పుడెలా వుంటాయో కారణాలు కూడా చెప్పాలటే? నువ్వేమన్నా అప్సరసవా? అసూర్యం పశ్యవా? ఆ అందం అంతా ఎప్పుడోపోయింది. ఆ పెర్స నాలిటీ 'హూష్‌కాకీ' అయిపోయింది. అసలు....ముందులే నా పక్క నుంచి. నీకెందుకు చెబ్తాను....చెప్పను. చెప్తే సినిమాలో హీరోయిన్ వుంది చూడు. దానికి చెబ్తాను—దానికయినా పూరికే చెప్పను. అది స్నానంచేస్తూన్నప్పుడు వుంది చూడు....పాలరాతి బొమ్మలా....అజంతా శిల్పంలా....అలా దాసోహం అనిపించేంత అందమైన పెర్సనాలిటీతో కనిపించినప్పుడు దానికేచెబ్తాను....ఆ అందం ఆ చక్కని ఒంపులు ఇక ఈజన్మలో నీకు రావే పిచ్చిముండా....ఆ శరీరం చూసి మనసుపాడయి

పోయింది. అందుకనే పూటుగామందేసుకుని, సెకండ్ షో టిక్కెట్టు కొనుక్కుని, ఆ సినొక్కటీ మళ్లీచూసివస్తున్నా....ఆ సీను రోజూ చూస్తాను....డబ్బులుంటే ఆ సీను కొనేసుకునే వాణ్ని.........."

తర్వాత మాటలు వినిపించుకోలేదుసావిత్రి. విషయం అర్థమయ్యింది. 'నిజం తెలియలేదన్న మాట. అమ్మయ్య' అని నిట్టూర్చింది.

విశ్వం మంచంమీద వాలి, మత్తుగా పేలుతూనే, నిద్రకు ఉపక్రమిస్తున్నాడు.

యాంత్రికంగా లేచిందిసావిత్రి.

గుమ్మంవైపు అడుగులేసింది.

తలుపులు గడియపెట్టి, వెనక్కుతిరిగింది. భర్తవైపుజాలిగా చూసింది. "రోజూతింటే పరమాన్నమయినా చేదుగానేవుంటుంది. దొరక్కదొరికిన పొరుగింటి పుల్లకూర అమృతంలావుంటుంది. స్వంత భార్య సంగతీ అంతే-

"ఇంట్లోఖర్చులకి మీజీతం ఒకపైసాకూడా యివ్వక' వేళకి భోజనానికి మాత్రం యింటికి మీరు చేరుతూంటే. నా నగలు, సామాను మీ తాగుడికే మీరు ఖర్చుచేసేస్తే, ఏ వుద్యోగం లేనినేను ఈ సంసారాన్ని ఎలా ఈదుతున్నానన్నుకున్నారు? పిల్లలకోసమయినా నేనుబ్రతక వలసిన అవసరం వుంది కదా-

"సినిమాలలో హీరోయిన్లు నగ్నంగా కనిపించవలసిన స్నాన ఘట్టాలు మొదలయిన సీన్లలో సరైన ఆకారంలేని వాళ్లశరీరాలు అందుకు పనికి రావనిగాని, వాళ్లు అలా నటించడానికి అంగీకరించకగాని, 'డూప్' లను ఆపనికి వుపయోగిస్తారు డైరెక్టర్లు. ఫోటోగ్రఫీ ట్రిక్కులతో ఆ శరీరాలు ఆ హీరోయిన్లవే ననే భ్రమకలిగిస్తారు. ఈ రోజు నువ్వులొట్టలేస్తూ చూసిన ఆసున్న శరీరం, అందమయిన ఒంపుసొంపులున్న ఆ అంజనా సుందరి శరీరం- నీకు స్వంతమయి వుండీ, అసహ్యించబడు

తూన్న ఈ అభాగ్యురాలిదేనయ్యా పిచ్చివాడా- ఇదిగో చూడు" అంటూ, ఒక్కొక్క బట్టే విప్పివడేసి, చేతుల్లోముఖం దాచుకుని, కట్టతెగిన గోదావరిలా కన్నీరు కారుస్తూ, కుప్పలా కులిపోయింది సావిత్రి, నగ్నంగా నిలవలేక.

—హీరోయిన్ నగ్న శరీరాన్ని తలచుకుంటూ, స్వప్న జగత్తులో, గాఢనిద్రలో వున్నాడు విశ్వం.

ఆంధ్రభూమి, 27-8-1981